సాక్షి

హనుమకొండ

శుక్రవారం । 29 । ఆగస్టు । 2025



సీఎస్‌సీల్లోనూ విద్యుత్ బిల్లుల స్వీకరణ - 8లో▸

ఇకనుంచి కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)ల లోనూ విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశాన్ని టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం కల్పించింది.



సైబర్ వలలో ఆలయ ఉద్యోగి

సైబర్ వలలో చిక్కుకుని కురవి భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయ సీనియర్ అసిస్టెంట్ కట్ట జగన్నాథం రూ.8.72 లక్షలు మోసపోయాడు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30°/23°

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై వర్షం కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నవేళ సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి తేలికపాటి జల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

నిమజ్జన ప్రదేశాలను పరిశీలించిన సీపీ



వరంగల్ క్రైం/వరంగల్ అర్బన్: వచ్చే నెల 5న ట్రై సిటీ పరిధిలో నిర్వహించే గణేశ్ నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి హనుమకొండ ప్రాంతంలో గణేశ్ ప్రతిమల నిమజ్జనం జరిగే కాజీపేట బంధం చెరువు, హనుమకొండ సిద్ధేశ్వర గుండం, హసన్‌పర్తి చెరువు, కట్టమల్లన్న, చిన్నవడ్డేపల్లి చెరువు తదితర ప్రాంతాల్లో గురువారం పోలీస్ అధికారులతో కలిసి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమ నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులతో సీపీ సమీక్షించారు. నిమజ్జనం జరిగే ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిన క్రేన్లు, సిబ్బంది నియామకం, విద్యుత్ ఏర్పాట్లు, బారికేడ్ల నిర్మాణం, తెప్పల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. ఏర్పాట్ల పరిశీలనలో వరంగల్ కలెక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, స్పెషల్ బ్రాంచ్, ట్రాఫిక్ ఏసీపీలు జితేందర్‌రెడ్డి, సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్లు సుధాకర్‌రెడ్డి, వెంకన్న, పోలీస్ అధికారులు ఉన్నారు.

వచ్చే నెల 22 నుంచి 'ఓపెన్' సప్లిమెంటరీ

విద్యారణ్యపురి: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సెప్టెంబర్ 22 నుంచి 29 వరకు నిర్వహించనున్నట్లు ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో–ఆర్డినేటర్ అనగోని సదానందం తెలిపారు. ఆయా పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఈఏడాది అక్టోబర్ 6 నుంచి 13 వరకు జరుగుతాయని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఓపెన్ స్కూల్, టెన్త్, ఇంటర్ విద్యార్థులు థియరీ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు.

స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాట్ల పరిశీలన



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జేఎన్ఎస్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేయనున్న స్పోర్ట్స్ స్కూల్ కమ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పనుల్ని గురువారం కలెక్టర్ స్నేహ శబరీష్ పరిశీలించారు. ఈసందర్భంగా స్టేడియం ఆవరణలోని హాస్టల్ భవనం, ఔట్ డోర్ క్రీడా మైదానాలు, గదుల్ని పరిశీలించారు. డీవైఎస్ఓ గుగులోతు అశోక్‌కుమార్‌ను మౌలిక వసతులు, తరగతి గదుల ఏర్పాట్ల అంశాలు అడిగి తెలుసుకున్నారు. ఈనెల 31లోగా క్రీడాకారులకు అవసరమైన వసతులు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ స్నేహ శబరీష్ వెంట అధికారులు సురేశ్, నరేందర్‌రెడ్డి, డీఎస్ఏ కోచ్‌లు, సిబ్బంది ఉన్నారు.

డిస్పెన్సరీ ఆకస్మిక తనిఖీ

కాజీపేట: కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయం–2లో ఉన్న సివిల్ డిస్పెన్సరీని గురువారం డీఎంహెచ్ఓ ఎ.అప్పయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిస్పెన్సరీలో రోగుల ఓపీ సేవలు, ఫార్మసీ, ఉద్యోగుల హాజరు తదితర రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి వైద్య సేవలు, రికార్డుల నిర్వహణపై సూచనలిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ జయకృష్ణ, పద్మజ, సుశీల, సల్మా, పద్మజ సిబ్బంది పాల్గొన్నారు.

కేయూ పరిధిలో పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: భారీ వర్షాల నేపథ్యంలో కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్న పరీక్షలు వాయిదా వేసినట్లు గురువారం పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్ తెలిపారు. కేయూ పరిధి బీఫార్మసీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు, ఎల్ఎల్‌బీ మూడేళ్ల కోర్సు రెండో సెమిస్టర్ పరీక్షలు, ఎల్ఎల్‌బీ ఐదేళ్ల ఆరో సెమిస్టర్ పరీక్షలు, ఎంఈడీ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు తెలిపారు. దూరవిద్య డిగ్రీ ఇయర్ వైజ్ స్కీం మొదటి, ద్వితీయ, తృతీయ సంవత్సరానికి సంబంధించిన పరీక్షలు సైతం వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 30 నుంచి ఆయా కోర్సుల పరీక్షలు టైంటేబుల్ ప్రకారమే యథావిధిగా జరుగుతాయని తెలిపారు. ఈనెల 28, 29 తేదీల్లో జరగాల్సి ఉండగా.. వాయిదాపడిన పరీక్షలు మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారనేది తర్వాత ప్రకటిస్తామని తెలిపారు.



కటాక్షపూర్‌చెరువు మత్తడి పరవళ్లు

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు గురువారం ఆత్మకూరు మండలం కటాక్షపూర్ చెరువు మత్తడి పడింది. వరంగల్–ములుగు 163 జాతీయరహదారిపై ఉన్న చెరువు మత్తడి మీదుగా వాహనాలు వెళుతున్నాయి. గుంతలు ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మత్తడి పోస్తున్న దృశ్యాలు చూపరులను కనువిందు చేస్తున్నాయి.

- ఆత్మకూరు/ సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, హన్మకొండ

భారీ వర్షం.. అప్రమత్తం

- జిల్లాలో కుండపోత
- ఇళ్లల్లోకి చేరిన వరద నీరు
- కమలాపూర్ మండలంలో 4.26 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు

కమలాపూర్/పరకాల: జిల్లాలో గురువారం భారీ వర్షం కురిసింది. దారులన్నీ జలమయమయ్యాయి. చెరువులు మత్తళ్లు దుంకాయి. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వరద నీరు చేరి ప్రజలు అవస్థలు పడ్డారు.

కమలాపూర్ మండలంలో..

కమలాపూర్ మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో కాలనీలు జలమయమయ్యాయి. కమలాపూర్‌లోని బస్టాండ్ ప్రాంతంలో హుజూరాబాద్–పరకాల ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు చేరి వాగును తలపించింది. వరద, వర్షపు నీరు వెళ్లేందుకు అనువైన డ్రెయినేజీలు లేక ఆ నీరంతా ఇళ్లు, వ్యాపార దుకాణాల్లోకి చేరింది. ఇళ్లల్లోకి చేరిన వరద నీటిని స్థానికులు బయటకు ఎత్తి పోశారు. కొన్నేళ్లుగా భారీ వర్షం కురిసిన ప్రతీసారి వర్షపు, వరద నీరంతా ఇళ్లల్లోకి చేరి బస్టాండ్ ప్రాంత వాసులు ఇబ్బందులు పడుతుండగా.. వరద నీరు రాకుండా కొందరు డ్రెయినేజీలు మూసివేస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొంటోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండల వ్యాప్తంగా 4.26 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

పరకాలలో..

ఎడతెరిపి లేకుండా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పరకాలలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి ఎస్సీ కాలనీ, మల్లారెడ్డి పల్లె, మమత నగర్, శ్రీనివాసకాలనీ, రాంనగర్ కాలనీల్లోని పలు ఇళ్లలోకి వరద నీరు చేరింది. వెంటనే మున్సిపల్ ఉద్యోగులు అప్రమత్తమై జేసీబీ ద్వారా కాల్వల్లో వరద నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ సుష్మ పలు కాలనీల్లో పర్యటించారు. చాలా మంది శిథిలమైన ఇళ్లను వదిలిపెట్టకపోవడంపై ఆమె హెచ్చరికలు జారీ చేశారు. ఒకవైపు భారీ వర్షాలు కురుస్తుంటే వాటిలోనే నివాసం ఉంటామంటే ఒప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. రోజుల తరబడి నానితే గోడలు కూలిపోతాయని, తక్షణమే ఆయా ఇళ్లను వదిలిపెట్టి బంధువులు, మిత్రుల నివాసాలకు వెళ్లాలని సూచించారు.

చలివాగు ప్రాజెక్టు పరిశీలన..

శాయంపేట : జోగంపల్లి శివారులోని చలివాగు ప్రాజెక్టును నీటిపారుదల ములుగు చీఫ్ ఇంజనీర్ కుమారస్వామి గురువారం పరిశీలించారు. ప్రాజెక్టులోని నీటి మట్టాన్ని అంచనా వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎగువన కురిసిన వర్షాలతో చలివాగు ప్రాజెక్టు నిండుకుండలా ప్రవహిస్తోందని, సమీప గ్రామస్తులు ప్రాజెక్టులో దిగవద్దని తెలిపారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరిధర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అమృత్ ఉన్నారు.



వాగును తలపిస్తున్న హుజూరాబాద్–పరకాల రహదారి



కమలాపూర్‌లోని ఓ హోటల్‌లోకి చేరిన వరద నీరు



పరకాల: రాంనగర్‌లోని ఓ ఇంటి ఆవరణలో వరద



ఎస్సీ కాలనీలో వరద నిల్వకుండా జేసీబీతో పనులు చేయిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు



శిథిలమైన ఇంటి గోడను పరిశీలిస్తున్న కమిషనర్ సుష్మ



చలివాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్ కుమారస్వామి

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్ఓ అప్పయ్య

శాయంపేట: ప్రజలు విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని, వైద్య సిబ్బంది మందుల పంపిణీలో ఇబ్బందుల్లేకుండా చూసుకోవాలని డీఎంహెచ్ఓ అప్పయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, పత్తిపాక, ప్రగతి సింగారంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి రికార్డులు, మందులు పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఐరన్ సిరప్, యాంటీబయాటిక్ సిరప్‌లు కొన్ని చోట్ల ఇవ్వట్లేదని కలెక్టర్ దృష్టికి రాగా శాయంపేటలో ఉన్నాయా లేదా.. పరిశీలించి ఫార్మసిస్టులతో మాట్లాడారు. అనంతరం పత్తిపాక ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాలు పరిశీలించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఎంత మందికి పరీక్షలు చేశారో తెలుసుకున్నారు. ఈసందర్భంగా డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ.. విష జ్వరాలపై వైద్యులు సిబ్బందితో సర్వే చేయించి ఎప్పటికప్పుడు వైద్యం అందించాలన్నారు. ఏ గ్రామంలో ఎక్కువ జ్వరాలు వస్తే అక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండడంతో పాటు సిబ్బంది ప్రతీరోజు 25 ఇళ్లను సందర్శించడంతో పాటు డ్రైడేపై అవగాహన కలిగించాలన్నారు. టెస్టింగ్ కిట్లు, మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల వైద్యాధికారి డాక్టర్ సాయికృష్ణ, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.



పత్తిపాక ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అప్పయ్య

గణపతి నిమజ్జన ఏర్పాట్లు ముమ్మరం చేయాలి

ఆత్మకూరు: గణపతి నిమజ్జన ఏర్పాట్లను ముమ్మరం చేయాలని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ అన్నారు. మండలంలోని కటాక్షపూర్‌లో బుధవారం సాయంత్రం డీసీపీ అంకిత్‌కుమార్ పరకాల ఏసీపీ సతీశ్‌బాబుతో కలిసి చెరువు వద్ద నిమజ్జనం కోసం ఏర్పాట్లు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. గణపతి మండపాలను ఆన్‌లైన్ చేసుకునేలా నిర్వాహకులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ సంతోశ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



కటాక్షపూర్‌లో నిమజ్జన ఏర్పాట్లపై సూచనలిస్తున్న డీసీపీ అంకిత్‌కుమార్

ఆకాశానికి పూసిన దూదిపూలు!



ఆకాశానికి దూదిపూలు పూసినట్లుగా మేఘాలు కమ్ముకొచ్చాయి. తరలిపోతున్న మేఘాలు చూపరులను కట్టిపడేశాయి. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్ జాతీయ రహదారిలో కనిపించిన ఈ సుమధుర దృశ్యాన్ని గురువారం 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

- సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ హనుమకొండ

బండి సంజయ్‌పై వ్యక్తిగత దూషణలు చేస్తే సహించం



మాట్లాడుతున్న బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోశ్‌రెడ్డి

- బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోశ్‌రెడ్డి

హన్మకొండ: కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌పై వ్యక్తిగత దూషణలు చేస్తే సహించేది లేదని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోశ్‌రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ దీన్ దయాళ్ నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను విమర్శించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ముందు ఏదో ఒక రాగం ఎత్తుకునే రాహుల్ గాంధీ బిహార్ ఎన్నికల ముందు ఓటు చోరీ అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని, ఓటు చోరీ జరిగితే రాష్ట్రంలో కాంగ్రెస్ ఎలా అధికారంలోకి వస్తుందని ప్రశ్నించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి స్థాయికి మించి మాట్లాడుతున్నారన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావుల కిషన్, కార్పొరేటర్లు రావుల కోమల, గుజ్జుల వసంత, నాయకులు సంద్ర మధు, గుజ్జుల మహేందర్‌రెడ్డి, శేషగిరి రావు, వేణు, శ్రావణ్, కుమారరాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి జంగ్ సైరన్..

ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు పూర్తి కావొస్తున్నా.. ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవట్లేదని, ఉద్యోగుల సమస్యల సాధనకు జంగ్ సైరన్ మోగిస్తామని ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని టీఎన్జీఓస్ భవన్‌లో ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ఆకుల రాజేందర్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈసందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో నేతలుగా తమపై తీవ్రమైన ఒత్తిడి ఉందన్నారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కార్యాచరణ ప్రకారం.. హనుమకొండ జిల్లా నుంచి సెప్టెంబర్ 8న బస్సు యాత్ర మొదలవుతుందని, అందులో రాష్ట్ర జేఏసీ మొత్తం హనుమకొండకు చేరుకుంటుందన్నారు. ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని బస్సు యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 12న లక్ష మంది ఉద్యోగులతో చలో హైదరాబాద్ కార్యక్రమం ఉంటుందన్నారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం ద్వారా మన నిరసనను పెద్ద ఎత్తున తెలియజేయాలని పేర్కొన్నారు. ఈసందర్భంగా పెన్షన్ విద్రోహ దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గెజిటెడ్ అధికారుల సంఘం నేత అన్నమనేని జగన్ మోహన్ రావు, జేఏసీ నేతలు తిరుపతిరెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఆకవరపు శ్రీనివాస్‌కుమార్, పెండెం రాజు, కట్కూరి శ్రీనివాస్, రాజ్‌కుమార్, రియాజొద్దీన్, సీతారాం, సర్వర్ హుస్సేన్, కుందూరు గోపాల్‌రెడ్డి, బైరి సోమయ్య, రవి ప్రకాశ్, విజయ్ మోహన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేఏసీ నేతలు

అత్యవసర పనులు పూర్తి చేస్తున్నాం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హన్మకొండ: అత్యవసరమైన ప్రతీ పనిని త్వరగా పూర్తి చేస్తున్నామని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. 58వ డివిజన్ పరిధి హనుమకొండ స్నేహనగర్‌లో అంతర్గత రోడ్ల నిర్మాణ పనుల్ని గురువారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాధాన్య క్రమంలో గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కనీవిని ఎరగని రీతిలో అభివృద్ధి జరిగిందన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం 57వ డివిజన్ హనుమకొండలోని ముంపునకు గురయ్యే అశోకా కాలనీ, గోకుల్ నగర్ ప్రాంతాలను వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, నాయకులు కె.రాజేశ్వర్‌రావు, బంక సంపత్ యాదవ్, తాళ్లపల్లి సుధాకర్ పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్: జిల్లాలోని ప్రీ ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఎంఈఓలు, పాఠశాలల హెచ్‌ఎంలు ప్రత్యేక దృష్టితో కృషి చేయాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం, ప్రీ ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థుల నమోదు సంఖ్య పెంచడం, తదితర అంశాలపై విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల రోజువారీ ఎఫ్ఆర్ఎస్ హాజరుశాతాన్ని పెంచాలన్నారు. పాఠశాలలకు రాని విద్యార్థుల గైర్హాజరుకు కారణాలు తెలియజేయాలన్నారు. అలాగే ఉపాధ్యాయుల ఎఫ్ఆర్ఎస్ సరైన రీతిలో నమోదు చేయాలన్నారు. తరగతి గదిలో ప్రతీ విద్యార్థిని పరిశీలించి అభ్యసన సామర్థ్యాలను గురించి ఉపాధ్యాయులు అడిగి తెలుసుకోవాలన్నారు. సమావేశంలో డీఈఓ వాసంతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

బోధనలో ప్రమాణాలు పెంచాలి..

న్యూశాయంపేట: విద్యాబోధనలో ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు చొరవ చూపాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన విద్యాశాఖ సమీక్షలో ఆమె మాట్లాడారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలని ఎంఈఓలను ఆదేశించారు. స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీలో భాగంగా బేస్‌లైన్ రిజల్ట్స్‌ను తెలంగాణ స్కూల్ యాప్‌లో ఆన్‌లైన్ చేయాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ విజయలక్ష్మి, డీఈఓ రంగయ్యనాయుడు, సుజన్‌తేజ పాల్గొన్నారు.

పరకాల అదనపు న్యాయమూర్తిగా శ్రీవల్లి శైలజ



పరకాల: పరకాల కోర్టు అదనపు న్యాయమూర్తిగా శ్రీవల్లి శైలజ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన ఆమెను పరకాల కోర్టు ప్రధాన న్యాయమూర్తి సాయిశరత్‌తో పాటు బార్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెండెల భద్రయ్య, కార్యదర్శి శ్రవణ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు పున్నం రాజిరెడ్డి, ఓంటేరు రాజమౌళి, ఏజీపీ మేరుగు శ్రీనివాస్, న్యాయవాదులు శ్రీనివాస్, చంద్రమౌళి, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీలకు ఎస్ఏలుగా పదోన్నతి

విద్యారణ్యపురి: వరంగల్ జిల్లాలో ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లు(ఎస్ఏ)గా పదోన్నతి కల్పిస్తూ గురువారం రాత్రి డీఈఓ రంగయ్యనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 129 స్కూల్ అసిస్టెంట్ల కేటగిరీలో ఖాళీలు ఉన్నాయి. అందులో 47 మంది ఏస్ఏలకు అర్హులైన ఎస్జీటీలు లేకపోవడంతో 82 మంది ఎస్జీటీలకు 1:1 నిష్పత్తిలో వెబ్ ఆప్షన్లకు మంగళవారం రాత్రి అవకాశం కల్పించారు. కలెక్టర్ అప్రూవల్ మేరకు డీఈఓ పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కేటాయించిన పాఠశాలల్లో జాయిన్ అయ్యేందుకు 15 రోజుల సమయం ఉంటుంది.

'కాశిబుగ్గ సర్కిల్'లో మహిళా మార్ట్

వరంగల్ అర్బన్: వరంగల్ కాశిబుగ్గ సెంటర్‌లోని బల్దియా సర్కిల్ కార్యాలయం కమర్షియల్ కాంప్లెక్స్‌లో మహిళా మార్ట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం సర్కిల్ కార్యాలయాన్ని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ఆమె పర్యవేక్షించారు. మేయర్ మాట్లాడుతూ.. స్వయం సహాయక మహిళా సంఘాల వారి వివిధ రకాల ఉత్పత్తుల్ని ప్రోత్సహించేందుకు మహిళా మార్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

సత్తాచాటిన ఆదివాసీ యువకుడు

- అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం



బంగారు పతకంతో వంశీ

వాజేడు: అవకాశం కల్పిస్తే దేశానికి పేరు ప్రఖ్యాతలు సాధించి పెడతామని నిరూపించాడు ఏజెన్సీలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మొడెం వంశీ అనే యువకుడు. ఈ నెల 24న ఉత్తర అమెరికాలోని కోస్టారికాలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ 68 కేజీల విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. వివరాలిలా ఉన్నాయి.. ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని ఇప్పగూడెం మారుమూల గ్రామానికి చెందిన మొడెం మోహన్‌రావు, లక్ష్మిల కుమారుడు వంశీ 10వ తరగతి వరకు చదివాడు. మొదటి నుంచి పవర్ లిఫ్టింగ్‌పై మక్కువ చూపేవాడు. దీంతో అతని ప్రతిభను గుర్తించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వారు వంశీని ప్రోత్సహించారు. వారి ప్రోత్సాహంతో జాతీయ స్థాయిలో గెలుపొంది అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. దాతల ఆర్థికసాయంతో అమెరికాలో జరిగిన పోటీల్లో పాల్గొని మొదటి స్థానంలో నిలిచాడు. ఆర్థికసాయం చేసి సహకరించిన ప్రతిఒక్కరికి వంశీ కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ ఉత్తమ బోధన ఉపాధ్యాయురాలిగా స్నేహలత




హన్మకొండ: జాతీయ ఉత్తమ బోధన ఉపాధ్యాయురాలు–2025 అవార్డుకు నక్క స్నేహలత యాదవ్ ఎంపికయ్యారు. హనుమకొండ గాంధీనగర్ (గోకుల్‌నగర్)కు చెందిన స్నేహలత హైదరాబాద్ కొండాపూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్‌స్ట్రక్షన్స్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఆమె 2007 నుంచి సీనియర్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్నారు. ఉద్యోగ రీత్యా ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాలో నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్నారు. సర్టిఫికెట్ కోర్సు అండ్ ప్లేస్‌మెంట్ వంటి వృత్తి విద్యా కోర్సులను అందిస్తూ వారికి ఉత్తమ విద్యాబోధన చేస్తున్న కృషిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వ స్కిల్ డెలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖ తెలంగాణ నుంచి నక్క స్నేహలతను ఉత్తమ బోధన ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసింది. సెప్టెంబర్ 5న న్యూ ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా నక్క స్నేహలత అవార్డు అందుకోనున్నారు.

సీఎస్‌సీల్లోనూ విద్యుత్ బిల్లుల స్వీకరణ

నిర్వాహకులకు లాగిన్ అవకాశం కల్పించిన టీజీ ఎన్పీడీసీఎల్

- గ్రామాల్లోనే వినియోగదారులు బిల్లులు చెల్లించే సౌకర్యం
- విద్యుత్ సిబ్బంది అవసరం లేకుండానే బిల్లులు రాబట్టుకునే దిశగా డిస్కం
- టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో 6 వేల కామన్ సర్వీస్ సెంటర్‌లు

హన్మకొండ: విద్యుత్ బిల్లుల చెల్లింపులు మరింత సులువు కానున్నాయి. ఇప్పటివరకు గ్రామాలకు విద్యుత్ సిబ్బంది వస్తేనే బిల్లులు చెల్లించేవారు. ఇక నుంచి కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)లోనూ విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశాన్ని టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం కల్పించింది. ఇప్పటికే బిల్లులు చెల్లింపునకు టీజీ ఎన్పీడీసీఎల్ మొబైల్ యాప్‌తో పాటు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం తదితర యూపీఐ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించే సౌలభ్యం ఉంది. గ్రామీణ ప్రాంత నిరక్షరాస్యులు, స్మార్ట్ ఫోన్ లేని వారు, వృద్ధులు, మహిళలు ఇప్పటికీ విద్యుత్ ఉద్యోగి వస్తేనే బిల్లులు చెల్లిస్తున్నారు. ఇక నుంచి విద్యుత్ ఉద్యోగి కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా గ్రామాల్లోని కామన్ సర్వీస్ సెంటర్‌లో చెల్లించే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం పౌరులకు సేవలు అందించేందుకు కామన్ సర్వీస్ సెంటర్‌ల రూపంలో ఐసీటీ ఆధారిత నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ కేంద్రాలు ఆధార్ నమోదు, బీమా, పాస్‌పోర్ట్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు వంటి అనేక రకాల సేవలను అందిస్తున్నాయి.



14 రోజుల సమయంలో..

సాధారణంగా గృహ వినియోగదారులు ప్రతీ నెల గ్రామాల్లోకి వచ్చే విద్యుత్ ఉద్యోగికి బిల్లులు చెల్లిస్తున్నారు. రీడింగ్ నమోదు చేసి వినియోగదారుడి చేతికి బిల్లు ఇచ్చిన తర్వాత బిల్లు చెల్లింపు చేయడానికి 14 రోజుల సమయం ఉంటుంది. ఈ 14 రోజుల్లో ఒక్కరోజు మాత్రమే విద్యుత్ ఉద్యోగి బిల్లుల వసూళ్లకు వస్తారు. సీఎస్‌సీల ద్వారా 14 రోజుల్లో ఏ రోజైనా బిల్లులు చెల్లించే సౌలభ్యం వినియోగదారుడికి అందుబాటులోకి రానుంది. సీఎస్‌సీ సెంటర్ నిర్వాహకులకు టీజీ ఎన్పీడీసీఎల్ లాగిన్ సౌకర్యం కల్పిస్తుంది. లాగిన్ ద్వారా వినియోగదారుల నుంచి బిల్లులు స్వీకరిస్తారు. ఈ మేరకు సీఎస్‌సీ సెంటర్ నిర్వాహకులు వినియోగదారుల నుంచి కొంత చార్జీలు వసూలు చేస్తారు.

బిల్లులు చెల్లించేలా అవగాహన..

ఇప్పటికే డిజిటల్ పేమెంట్‌లను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్న విద్యుత్ పంపిణీ సంస్థలు ఇప్పుడు కామన్ సర్వీస్ సెంటర్‌లను బిల్లులు స్వీకరించేందుకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా క్రమంగా విద్యుత్ బిల్లుల చెల్లింపును పూర్తిగా వినియోగదారుడిని బాధ్యుడిని చేయనుంది. పైగా సిబ్బంది కొరత తీరనుంది. గ్రామాల్లోకి ఉద్యోగిని పంపించడాన్ని విరమించుకోనుంది. ఈ క్రమంలో గ్రామాల్లోని వినియోగదారులు కామన్ సర్వీస్ సెంటర్‌లో బిల్లులు చెల్లించే విధంగా అవగాహన కల్పించనున్నారు.

టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో 6వేల సీఎస్‌సీలు

టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో 17 జిల్లాలు 299 మండలాలున్నాయి. 7,184 గ్రామ పంచాయతీలుండగా దాదాపు ఆరు వేల వరకు కామన్ సర్వీస్ సెంటర్‌లున్నాయి. హెచ్‌టీ సర్వీస్‌లు 5,003, ఎల్‌టీ సర్వీస్ లు 68,62,858 ఉన్నాయి. ఎల్‌టీ సర్వీస్‌ల్లో గృహ వినియోగదారులు 47,41,394, వాణిజ్య వినియోగదారులు 6,01,303, పారిశ్రామిక వినియోగదారులు 33,753, వ్యవసాయ వినియోగదారులు 13,54,099, ఇతరులు 1,32,309 మంది ఉన్నారు.

సైబర్ వలలో ఆలయ ఉద్యోగి

- రూ.8.72 లక్షలు కాజేసిన సైబర్ నేరస్తులు
- పోలీసులకు ఫిర్యాదు



కట్ట జగన్నాథం




జగన్నాథం క్రెడిట్ కార్డులు

కురవి: సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా బాధితులు మోసపోతున్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కట్ట జగన్నాథం సైబర్ వలలో చిక్కుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. కరీంనగర్ జిల్లాకు చెందిన కట్ట జగన్నాథం గత కొన్నేళ్ల నుంచి కురవిలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి ఆలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 26న (మంగళవారం) సైబర్ నేరగాడు 6003447660 నంబర్ నుంచి ఫోన్ చేసి 'హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నా.. మీకు హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డు ఉంది కదా.. దాని లిమిట్ పెంచుతాం.. ఇది అంతా ఉచితమే' అని చెప్పాడు. దీంతో జగన్నాథం అతడి మాటలను నమ్మాడు. అతడు (సైబర్ నేరగాడు) సెల్‌ఫోన్‌లో హెచ్‌డీఎఫ్‌సీ 'మై కార్డ్స్' యాప్ ఓపెన్ చేయమని చెప్పడంతో తన మొబైల్‌లో ఆ యాప్ లేదని బాధితుడు తెలిపాడు. సెల్‌ఫోన్ వాట్సాప్‌కు లింక్ పంపిస్తా ఓపెన్ చేయమని చెప్పడంతో జగన్నాథం ఓపెన్ చేశాడు. వెంటనే మైకార్డ్స్ యాప్ లింక్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు గుర్తులతో వచ్చింది. అతను చెప్పినట్లే బాధితుడు లింక్‌ను ఓపెన్ చేయడంతో అందులో రూ.6.89 లక్షలు క్రెడిట్ లిమిట్ పెరిగినట్లు చూపించింది. అనంతరం అవతలి వ్యక్తి ఇంకా నీకు ఏమైనా క్రెడిట్ కార్డులున్నాయా? అని అడిగాడు. ఎస్‌బీఐ, యాక్సిస్‌బ్యాంక్, ఇండస్‌ల్యాండ్ కార్డులున్నాయని చెప్పడంతో అవతలి వ్యక్తి ఫోన్ పెట్టేశాడు. అన్ని కార్డుల గురించి ఎందుకు అడిగాడని అనుమానం రావడంతో వెంటనే ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు యాప్‌లో చెక్ చేయగా అందులో నుంచి రూ.1,61,353 డెబిట్ అయినట్లు గుర్తించాడు. దీంతో వెంటనే అవతలి వ్యక్తి ఫోన్ నంబర్‌కు ఫోన్ చేయడంతో సాయంత్రం వరకు మీకు డబ్బులు వస్తాయని చెప్పి ఫోన్ కట్ చేశాడు. యాక్సిస్ బ్యాంకు కార్డు నుంచి రూ.3,87,093, ఇండస్ బ్యాంకు క్రెడిట్ కార్డు నుంచి రూ.1,94,498, హెచ్‌డీఎఫ్‌సీ కార్డు నుంచి రూ.1.30లక్షలు కట్ అయ్యాయి. ఇలా నాలుగు క్రెడిట్ కార్డుల నుంచి మొత్తం రూ.8.72 లక్షలు కట్ అయ్యాయి. దీంతో మోసపోయానని గుర్తించి వెంటనే ఆన్‌లైన్‌తో పాటు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై గండ్రాతి సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ పునరుద్ధరణకు అహర్నిశలు కృషి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హన్మకొండ: భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణకు విద్యుత్ అధికారులు, ఉద్యోగులు అహర్నిశలు శ్రమిస్తున్నారని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన భారీ వర్షాలు కురిసిన కామారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో పర్యటించారు. దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ సర్కిల్ పరిధిలో నేలకూలని 108 విద్యుత్ స్తంభాలకు 87 స్తంభాలు పునరుద్ధరించామని, 21 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు 17 సరి చేశామని, 86 ట్రాన్స్‌ఫార్మర్‌లు నీట మునుగగా 6 ట్రాన్స్‌ఫార్మర్లు పునరుద్ధరించామన్నారు. భారీ వరద, ముంపుతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. విద్యుత్ పునరుద్ధరణకు బ్రేక్‌డౌన్ టీం సిద్ధంగా ఉందని, రేయింబవళ్లు నిబద్ధతతో పని చేస్తున్నారన్నారు. కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో లోడ్ మానిటరింగ్ సెల్ కంట్రోల్‌రూంను పరిశీలించి వర్షాలతో విద్యుత్ సరఫరా, సబ్ స్టేషన్ల పనితీరు, స్తంభాలు, లైన్ల పనితీరు, స్థితిగతులను తనిఖీ చేశారు. వర్షాలతో ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగులు సెలవులు తీసుకోవద్దని ఆదేశించారు.



నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయిలో ఉద్యోగులతో మాట్లాడుతున్న వరుణ్‌రెడ్డి

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



వెంకన్న (ఫైల్)

మరిపెడ రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం స్టేజితండా గ్రామపంచాయతీ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. స్టేజితండా గ్రామపంచాయతీ పరిధిలోని మేగ్యాతండాకు చెందిన భూక్య వెంకన్న (35) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వెంకన్నకు పదేళ్ల క్రితం రజితతో వివాహం కాగా, వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల భార్య పుట్టింటికి వెళ్లింది. స్టేజితండా పరిధిలోని ఓ వెంచర్‌లో ఆటో నిలిచి ఉండగా గురువారం తెల్లవారుజామున స్థానికులు గమనించి ఆటోలో ఉన్న వెంకన్నను లేపగా ఉలుకుపలుకు లేదు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా నా కొడుకు వెంకన్నను కోడలు రజితతో పాటు మరో వ్యక్తి కావాలనే చంపారని, వారిపై చర్య తీసుకోవాలని ఆరోపిస్తూ మృతుడి తండ్రి హచ్చు మరిపెడ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

వేయిస్తంభాల ఆలయంలో గణపతి ఉత్సవాలు

- ప్రారంభించిన ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీ కావ్య, పక్కన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



వరసిద్ధి వినాయకుడి అలంకరణలో ఉత్తిష్టగణపతి

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల దేవాలయంలో బుధవారం వినాయక చవితిని పురస్కరించుకుని గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, వేదపండితులు మణికంఠశర్మ, సందీప్‌శర్మ, ప్రణవ్‌ల ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుంచి ఉత్తిష్ట గణపతికి కోనేరునీటితో నవరసాభిషేకం నిర్వహించి, హరిద్రాకుంకుమలేపనం గావించి వరసిద్ధివినాయకుడిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. విగ్రహదాత శ్రీకుమార్ రెమాండ్స్ షోరూం అధినేత వెనిశెట్టి సుబ్రహ్మణ్యం ఇంటి నుంచి మంగళవాయిద్యాలతో వేదమంత్రోచ్ఛరణలతో ఊరేగింపుగా విగ్రహాన్ని తీసుకువచ్చి విష్ణుమూర్తి ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన వేదికపై ప్రతిష్ఠించారు. కళశస్థాపన, మంటపారాధన, నవగ్రహారాధన, అఖండదీపారాధన, శోడషోపచారపూజ, పత్రిపూజ, ఉండ్రాళ్ల నైవేద్యం నివేదన, ఋత్విగ్వరణం, మహాహారతి, తీర్థప్రసాదాల వితరణ జరిపారు. అనంతరం అగ్ని ప్రతిష్ఠాపన, గణపతి నవగ్రహరుద్రహోమం నిర్వహించారు.

ఆలయ అభివృద్ధికి రూ.75కోట్లు..

మహాగణపతి ఉత్సవాలను ఎంపీ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ వేయిస్తంభాల ఆలయ అభివృద్ధికి రూ.75కోట్లు కేటాయించాలని కేంద్ర పురావస్తు, టూరిజం శాఖ మంత్రి గజేంద్రసింగ్ షికావత్‌ను కలిసి విన్నవించినట్లు తెలిపారు. దీనికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు గట్టు మహేష్‌బాబు, దాత నడిపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రవచకులు వంగల సోమయాజులు శమంతకోపాఖ్యానం వినిపించారు.


శ్రీలక్ష్మిగణపతిగా అలంకరణ

గణపతి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు వరసిద్ధి వినాయకుడిగా, రెండో రోజు శ్రీలక్ష్మి గణపతిగా అలంకరించి భక్తులకు దర్శనానికి అనుమతించారు. వేముల సత్యమూర్తి ఆధ్వర్యంలో నిత్యాన్నదానం ప్రారంభించారు. ఆలయ ఈఓ ధరణికోట అనిల్‌కుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉత్సవకమిటీ సభ్యులు పులి రజినీకాంత్, గండ్రాతి రాజు, చొల్లేటి కృష్ణమచారి పాల్గొన్నారు. సాయంత్రం శివానంద నృత్యమాల శిష్య బృందంచే కూచిపూడి నృత్యాలు అలరించాయి.

హత్యకేసులో నలుగురికి జీవితఖైదు

వరంగల్ లీగల్: ఉమ్మడి కుటుంబానికి చెందిన ఇల్లు, సాగు భూమి పంపకం తగాదాలో ఒకరిని హత్య చేసిన నేరం రుజువు కావడంతో వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం బంధంపల్లికి చెందిన నేరస్తులు మక్కాజీ ప్రవీణ్, సరిత, ప్రమీల, బొక్క రాజులకు జీవిత ఖైదు, రూ.5వేలా జరిమానా విధిస్తూ గురువారం వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ నిర్మలాగీతాంబ తీర్పు వెలడించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు బంధంపల్లికి చెందిన మక్కాజీ రాజేష్ కారు డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. రాజేష్‌కు తమ్ముడు ప్రవీణ్, చెల్లెలు సరిత, తల్లి ప్రమీల ఉన్నారు. వీరికి ఉమ్మడిగా ఇల్లు, కొంత సాగు భూమి ఉంది. వీటి పంపకం విషయమై రాజేష్‌కు కుటుంబ సభ్యులతో గొడవలు జరిగాయి. బతుకుదెరువు కోసం రాజేష్ తన భార్య, కుమారుడితో వరంగల్‌కు వెళ్లిపోయాడు. కొద్ది కాలం తర్వాత జూలై 6, 2021న ఉమ్మడి ఆస్తి పంపకం విషయమై మాట్లాడాలని రాజేష్ తన భార్య శైలజతో కలిసి స్వగ్రామమైన బంధంపల్లికి వెళ్లాడు. అదేరోజు మధ్యాహ్నం బొక్క రాజు ఆటోతో మక్కాజీ ప్రవీణ్, సరిత, ప్రమీల వచ్చి ఇక్కడికి ఎందుకు వచ్చావురా..? నీకు ఆస్తి కావాలారా..? అంటూ ఒక్కసారిగా మూకుమ్మడిగా రాజేష్, శైలజలపై దాడి చేశారు. వెంట తెచ్చుకున్న కారం పొడి చల్లి రాళ్లతో తల, వీపుపై కొట్టారు. శైలజ ఎంత బ్రతిమిలాడిన వినకుండా రాజేష్‌ను విపరీతంగా కొట్టారు. రాజేష్, శైలజ ఇంకా చావలేదు చూడండి అని బొక్క రాజు రెచ్చగొట్టడంతో ప్రవీణ్ కత్తితో తన అన్న రాజేష్‌పై విచక్షణ రహితంగా దాడి చేశాడు. అప్పటికే గ్రామస్తులు రావడం గమనించి ప్రవీణ్, సరిత, రాజు పారిపోగా, గ్రామస్తుల సహకారంతో రాజేష్‌ను తీసుకొని ఆయన భార్య శైలజ, తల్లి ప్రమీల ఎంజీఎంకు వచ్చారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే రాజేష్ మృతి చెందినట్లుగా ప్రకటించారు. విషయం తెలిసిన తల్లి ప్రమీల అక్కడి నుంచి పారిపోయింది. జరిగిన ఘటనపై రాజేష్ భార్య శైలజ ఫిర్యాదు మేరకు దుగ్గొండి పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువుకావడంతో నేరస్తులు నలుగురికి జీవిత ఖైదు, రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి నిర్మలాగీతాంబ తీర్పు వెల్లడించారు. కేసును ప్రస్తుత పరకాల ఏసీపీ సతీష్, దుగ్గొండి సీఐ సాయిరమణ పరిశోధించగా, లైజన్ ఆఫీసర్ హరికృష్ణ పర్యవేక్షణలో హెడ్‌కానిస్టేబుల్ జి.రవికుమార్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన పీపీ సిరబోయిన శ్రీనివాస్ కేసును వాదించారు.

గోదారమ్మతో మురిసిన జ్ఞానదీపం



గోదావరి ఉధృతి తరలిరావడంతో నీటిమధ్యలో అద్భుతంగా దర్శనమిస్తున్న జ్ఞానదీపం

కాళేశ్వరం: ఈ వర్షాకాలం సీజన్‌లో కాళేశ్వరంలో మూడుసార్లు వీఐపీ ఘాటు వద్ద ఏర్పాటుచేసిన జ్ఞానదీపాలను ప్రాణహిత, గోదావరి వరద ముంచెత్తింది. గురువారం ఎగువ నుంచి గోదావరి వరద పోటెత్తడంతో వరదనీరు జ్ఞానదీపం చుట్టూరా చేరి చూపరులను అద్భుతంగా కనువిందు చేస్తోంది.

రైల్వే రవాణాకు వర్షం ఎఫెక్ట్

- పలు రైళ్లు రద్దు, మరికొన్ని దారి మళ్లింపు
- కాజీపేట జంక్షన్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు



కాజీపేట జంక్షన్‌లో ఏర్పాటు చేసిన రైల్వే హెల్ప్‌డెస్క్

కాజీపేట రూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో దక్షిణ మధ్య రైల్వే అధికారి పలు రైళ్లను దారి మళ్లించగా మరికొన్ని రైళ్లను రద్దు చేశారు. గురువారం కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్, సీపీఆర్ఓ శ్రీధర్ మాట్లాడుతూ కాజీపేట నుంచి బల్లార్షా వెళ్లే రెండు ప్యాసింజర్ రైళ్లు, డైలీ రామగిరి ప్యాసింజర్, కాజీపేట–బల్లార్షా వెళ్లే డైలీ అజ్నీ ప్యాసింజర్ రైళ్లను శుక్రవారం రద్దు చేస్తున్నామన్నారు. అలాగే కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే 8 ఎక్స్‌ప్రెస్ రైళ్లను శుక్రవారం వయా పెద్దపల్లి, పెద్దపల్లి, కరీంనగర్ మీదుగా దారి మళ్లించి నడిపిస్తున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్–తిరుపతి (17405) కృష్ణా ఎక్స్‌ప్రెస్, నర్సాపూర్–నాగర్‌సోల్ (12787) ఎక్స్‌ప్రెస్, ముంబాయి–లింగంపల్లి (17057) ఎక్స్‌ప్రెస్, ఓకా–రామేశ్వరం (16734) ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి–ముంబాయి (17058) ఎక్స్‌ప్రెస్, బిజికెటి–కాచిగూడ (17606) ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–జైపూర్ (12720) ఎక్స్‌ప్రెస్, కాచిగూడ–బిజికెటి (17605) ఎక్స్‌ప్రెస్‌ను వయా కాజీపేట బైపాస్ లైన్ మీదుగా పెద్దపల్లి, కరీంనగర్, ఆర్మూర్, నిజామాబాద్ మీదుగా దారి మళ్లించి నడిపిస్తున్నట్లు తెలిపారు. అలాగే కాజీపేట–సిర్పూర్ టౌన్ (17003) వెళ్లే ప్యాసింజర్, కరీంనగర్–సిర్పూర్‌టౌన్ (67772) వెళ్లే పుష్‌పుల్, సిర్పూర్ టౌన్–కరీంనగర్ (67771) వెళ్లే పుష్‌పుల్ రైళ్లు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. భద్రాచలంరోడ్–బల్లార్షా (17033) వెళ్లే సింగరేణి కాజీపేట–బల్లార్షా మధ్య, సిర్పూర్‌టౌన్–భద్రాచలంరోడ్ (17034) వెళ్లే సింగరేణి సిర్పూర్‌టౌన్–కాజీపేట, సికింద్రాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ (17233) వెళ్లే ఎక్స్‌ప్రెస్ కాజీపేట–సిర్పూర్‌కాగజ్‌నగర్, సిర్పూర్‌కాగజ్‌నగర్– సికింద్రాబాద్ (17234) వెళ్లే ఎక్స్‌ప్రెస్ సిర్పూర్‌కాగజ్‌నగర్– కాజీపేట మధ్య రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

కాజీపేట జంక్షన్‌లో రైల్వే హెల్ప్‌డెస్క్

వర్షాల కారణంగా కాజీపేట జంక్షన్ మీదుగా అప్ అండ్ డౌన్ రూట్‌లో ప్రయాణించే పలు రైళ్లను దారి మళ్లించి నడిపిస్తున్న నేపథ్యంలో రైల్వే అధికారులు కాజీపేట జంక్షన్‌లో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. రైళ్ల రద్దు, దారి మళ్లింపు, పాక్షికంగా రద్దు, ఆలస్యంగా నడిచే రైళ్ల వివరాలను ఎప్పటికప్పుడు ప్రయాణికులకు తెలియజేస్తున్నామన్నారు.

మా మొర ఆలకించవా..గణనాథ

- 317 జీఓ బాధిత టీచర్ల ఆవేదన



వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యారణ్యపురి: మా మొర ఆలకించవా..గణనాథ అని హనుమకొండలోని పలువురు 317 జీఓ బాధిత ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. వినాయక చవితి సందర్భంగా బుధవారం పలు చోట్ల గణనాథుడి విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ నాయకుడు కూరపాటి సత్యప్రకాశ్‌రావు మాట్లాడుతూ స్థానికత ఆధారంగా తమ సమస్యలను పరిష్కరించేలా సీఎంకు కనువిప్పు కలగాలని వేడుకున్నామన్నారు. బాధిత ఉపాధ్యాయులు శ్రీని వాస్, రమాదేవి, ఆగయ్య, రాజమౌళి తదితరులు ఉన్నారు.

బోధన నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

- కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం

కేయూ క్యాంపస్: అధ్యాపకులు బోధన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని కేయూ రిజి స్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం కోరారు. గురువారం క్యాంపస్‌లోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలోని సెమినార్ హాల్‌లో 'డేటా డ్రివెన్ టీచింగ్ బిజినెస్ అనాలటిక్స్ అండ్ పవర్ బి ఐ ఫర్ ఎడ్యుకేటర్స్' అనే అంశంపై మూడు రోజుల వర్క్‌షాపు నిర్వహించారు. మొదటి రోజు ప్రారంభ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధ్యాపకులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బోధన నైపుణ్యాలను అప్‌గ్రేడ్ చేసుకోవాలన్నారు. అనంతరం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రిన్సిపాల్ ఆచార్య అమరవేణి, డీన్ ఆచార్య రాజేందర్, బీఓఎస్ చైర్మన్ ఆచార్య వరలక్ష్మి మాట్లాడారు. వర్క్‌షాప్‌లో డాక్టర్ ఫణీంద్ర, డాక్టర్ ప్రగతి, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలి

- టెలీ కాన్ఫరెన్స్‌లో మంత్రి రాజనర్సింహా

ఎంజీఎం: ప్రస్తుతం రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజారోగ్యానికి ఇబ్బందులు తలెత్తకుండా వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. స్నేక్ బైట్, సీజనల్ వ్యాధులు విస్తరించకుండా అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వచ్చే రెండు, మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యులు, నర్సింగ్ స్టాఫ్, ఫార్మాసిస్టులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, పంచాయతీ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులతో సమన్వయం చేసుకొని అధిక వర్ష ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ డీఎంహెచ్‌ఓ అప్పయ్య, అదనపు డీఎంహెచ్‌ఓ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగల అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

వరంగల్ క్రైం: వినాయక చవితి పండుగ సందర్భంగా హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లష్కర్ బజార్‌లో వస్తువులు తీసుకుంటుండగా కొంతమంది దొంగలు ప్రజల దృష్టి మరలించి సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడినట్లు ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు జార్ఖండ్‌కు చెందిన ఐదుగురు సెల్‌ఫోన్ దొంగలను అరెస్టు చేసి వారినుంచి రూ.1.50 లక్షల విలువ గల మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులు బీహార్‌కు చెందిన షేక్ షాహీన్ షా, జార్ఖండ్‌కు చెందిన బిష్ణుమ్యాతో, బబ్లూ మ్యాతో, షేక్ దిల్‌దార్ షేక్ నిహాల్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన సిబ్బంది రవూఫ్, అశోక్, మహేందర్‌లను ఇన్‌స్పెక్టర్ శివకుమార్ అభినందించారు.